కథా కౌముది

# ప్రేమంటే

అనుపమ గాలి

"అప్పట్లో ఆయనే మీ తాతగారు అని నాకు తెలిసింది కాదు." మామ్మ వడియాల పిండిలో ఉప్పు సరిపోయిందో లేదో చూస్తూ చెబుతోంది. "నాకేమో ఎనిమిది, ఆయనకేమో పధ్నాలుగు. నాకన్నా పెద్ద అన్న ఊహ కూడా ఉండేది కాదు. కాస్త ఆ చీర ఎండలో వేస్తావూ?"

నేను బాగా ఎండగా ఉన్న చోట చీర పరిచి పక్కనే కూర్చున్నాను.

"ఒంటి మీద నూలు చొక్కా, కింద గళ్ళ నిక్కరు వేసుకుని ఉండేవారు ఎప్పుడూ. మేమంతా కలిసే ఆడుకునేవాళ్ళం. ప్రతి ఆటా న్యాయంగా ఆడాలని అనేవారు. నాకేమో కొన్ని ఆటలు సరిగ్గా తెలీవాయే! అప్పుడు ఆయనే నేర్పేవారు. ఇక ఆటకి కావాల్సినవి కూడా మేము సగం-సగం చేసేవాళ్ళం. గళ్ళు నేను వేస్తే చింత పిక్కల సంగతి ఆయన చూస్కునే వారు. మాతో పాటూ ఆడుకునేవాళ్ళలో పక్కింట్లో సుబ్బులు ఉండేది. ఇద్దరికీ క్షణం పడేది కాదు. నా ఈడే కానీ చూడటానికి కాస్త పెద్దగా ఉండేది. కాస్త పొడగరి. అంతేనా? చేప లాంటి పెద్ద, పెద్ద కళ్ళు కూడానూ"

"నేనూ పెట్టనా?" మామ్మ పెట్టే వడియాలని చూస్తూ ఆశగా అడిగాను.

"పెడుదూగాని, ముందు నేను ఎలా పెడుతున్నానో గమనించు. సుబ్బులు సంగతి చెప్తున్నాను కదూ! అది మహా పెంకిది. ఆటలో ఓడిపోతే ఉడికిపోయేది. మీ తాతగారు గెలిస్తే మరీనూ." మామ్మతో పాటూ నేనూ నవ్వుకున్నాను.

"సుబ్బులు ని మీ పెదతాతయ్యకి ఇచ్చి పెళ్లి చేశారు. వాళ్ళ పెళ్ళి జరుగుతున్నప్పుడే మా పెళ్లి మాటలు కూడా అయిపోయాయ్. దాని పెళ్లి కార్తీకంలో అయింది. ఆ తర్వాత మాఘంలో మా పెళ్లి జరిగింది. "

"ఆగాగు.. అంతేనా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అంతేనా? పెళ్లి ఎంత ఘనంగా చేశారు అనుకున్నావు? విందంటే మా పెళ్లి లోదే అని పై ఊర్లో చెప్పుకునేటంత బాగా. "

"మీ అమ్మ,నాన్న బాగా ఉన్నవాళ్ళా?"

" ఆ ఏముండేదనీ? బాగా బతికిన వాళ్ళని జాలి ఉండేది. మనుషులు సౌమ్యం అన్న పేరు ఉండేది. అంతే, అంతకు మించి ఆస్తులు ఏమీ ఉండేవి కావు. అసలు గొప్పతనం అయినా మాది కాదులే, మా అత్తది. నన్ను కోరి కోడల్ని చేసుకుంది. అమ్మ తర్వాత అమ్మలా చూసుకునేది."

"నిజమా?"

"అవును. పిల్లలం అందరం ఆడుకుని,పొలాలు తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకునే వాళ్ళం. జీడిపప్పు నేతిలో వేయించి ఉప్పు,కారం జల్లి గుప్పిట్లో పోసేది." వడియాలు పెట్టటం ఆపి దోసిలి చూపిస్తూ మామ్మ చెప్తోంది. "భోజనాలు అయ్యాక అందరం కలిసే పడుకునే వాళ్ళం. అత్తకి అటు పక్క మీ తాతగారు, ఇటు పక్క నేను."

"ఇబ్బంది కదూ? " నొసలు చిట్లిస్తూ అడిగాను.

మళ్లీ వడియాల పని మొదలుపెట్టి "మరి మేము చిన్న పిల్లలం కదా? అయినా నాకు మా ఇంట్లో ఉన్నట్టే ఉండేది. అసలు ఇబ్బందే ఉండేది కాదు. ఇందులో ఇబ్బంది పడాల్సిన విషయం ఏముందని? కొంత కాలం అయ్యాక మా అత్త మమ్మల్ని వేరేగా పడుకోమనేది. తను నా తోడి కోడలు లలిత దగ్గర పడుకునేది. నాకేమో బెంగగా ఉండేది. నాకు బాగా గుర్తు – ఒకరోజు రాత్రి పక్కన అత్త లేకపోయేసరికి నేను బాగా ఏడ్చాను. అప్పుడు అత్త నన్ను పక్కన కూర్చోబెట్టుకుని చెప్పింది– లలిత నీ కంటే చిన్నది కదా? నేను దానితో ఉంటాను. నిన్ను మా రాముడు బాగా చూసుకుంటాడు, ఏ కష్టం వచ్చినా వాడితో చెప్పుకో అని. అత్తమాటంటే వేదమే కదా, నేను ఒప్పుకోక తప్పలేదు.

కాలం గడిచేకొద్దీ కొత్త జీవితానికి నేను అలవాటు పడ్డాను. ఒక మూడు ఏళ్ళకి అనుకుంటాను పెద్ద వాడు మూర్తి కడుపులో పడ్డాడు. ఇక అప్పటి మొదలు.. ఇక్కడ కూర్చో, అక్కడ కూర్చోకు. ఈ పని చెయ్యకు, ఆ పని చెయ్యి. ఇది తిను, అది ముట్టుకోకు అని చెప్పేవాళ్ళు. నాకు అదేమిటో తెలిసేది కాదు. ఇంట్లో మిగతా కోడళ్ళు, ఆడపడుచులు చెప్పగా తెలిసింది నేను గర్భవతిని అని, తొందరలో నా బొజ్జ పెద్దది అవుతుందని, అందులో ఒక ప్రాణి ఉంటుందని. "

వడియాలు పెట్టేసి పిట్టగోడ వారగా నీడలో కూర్చున్నాము నేను, మామ్మ.

"నా వయసు పధ్నాలుగు అనుకుంటాను. ఆ వయసులో కళ్ళ నిండుగా ఆయన్ని చూడటం అదే ఆఖరిసారి . నేను లేచేసరికే ఆయన పొలం పనులు చూస్కోటానికి వెళ్ళిపోయే వాళ్ళు. అయన వచ్చేసరికి నాకు నిద్ర ముంచుకొచ్చి నేను పడుకునేదాన్ని. తర్వాత పురుడు అని మా అమ్మ దగ్గరికి వెళ్ళిపోయాను. మూర్తి పుట్టాడు. ఆయన వచ్చి బిడ్డను చూస్కున్నారు అని చెప్పారు కాని నాకు కలిసే అవకాశం దొరకలేదు. మూర్తికి సంవత్సరం వచ్చేంత వరకు ఏవో అనారోగ్యాలు– అమ్మోరు అని, కామెర్లు అని. ఇక అమ్మ లేకుండా పెద్దింట్లో కష్టమని అక్కడే ఉండిపోయాను. అడపాదడపా అత్త వచ్చి నన్ను చూసిపోయేది. ఆయన సంగతి అడగాలని ఉన్నా నేను సిగ్గుతో ఎప్పుడూ అడగలేదు. అక్కడి విషయాలు మా అత్త చెప్తే వినటమే! నేను ఏడాది బిడ్డతో తిరిగి వెళ్లేసరికి ఆయన చాలా మారిపోయారు. గుబురు మీసాలు, ఉంగరాల జుట్టునూ. స్వరం కూడా మారిపోయింది. భలే గమ్మత్తుగా." మామ్మ కళ్ళలో ఏదో మెరుపు కనిపించింది నాకు.

"ఇక మూర్తి రావటం వల్ల ఇంటికి ఎంత శుభం జరిగింది అనుకున్నావు? వెంటవెంటనే ఎన్ని కాన్పులో. సుబ్బులు నెల తప్పిన ఏడే లలిత కూడా నెల తప్పింది. చూస్తుండగానే ఇంటి నిండా పిల్లలు. కళకళలాడిపోయేది ఇల్లంతా. పిల్లలు, వాళ్ళ అవసరాలతో ఆడవాళ్ళం మేము మా లోకంలో మేము ఉండేవాళ్ళం. పొలం పనులని, కౌలు డబ్బులని మగవాళ్ళు తలమునకలై ఉండేవాళ్ళు. చిన్నప్పటికి మల్లె అంత సమయం కలిసి ఉండటానికి వీలేది? ఆ, భోజనాల వేళకి తప్పనిసరిగా ఇంటికి వచ్చేవాళ్ళు లే! మీ తాతగారికి ఆనపకాయ పులుసు బాగా నచ్చేది. నాకెలా తెలిసింది అనుకునేవు– ఎప్పుడు చేసినా రెండు సార్లు కలుపుకుని తినేవారు. ఉల్లిపాయ కారం కూడా." మామ్మ చెప్పటం ఆపేసింది. బహుశా ఆ రోజులు గుర్తు వచ్చాయేమో!

25 ఏళ్ళ కిందట మా తాతగారు పోయారు. మామ్మ 25వ ఏట. అప్పటినుండి ఒంటరిగానే ఉండింది మామ్మ. అంత సేపు తాతగారి గూర్చి మాట్లాడినందుకు సిగ్గుపడిందో ఏమో నాకు తెలీదు. హఠాత్తుగా ఈ లోకంలోకి వచ్చినట్టు "అయినా ఎందుకు అడుగుతున్నావు ఇప్పుడు ఇవన్నీ?" అని అడిగింది.

"ఊరకే మీది ప్రేమ పెళ్లి ఏమో తెలుసుకుందామని. ఎంతైనా మీకు మీ పెళ్ళికి ముందే పరిచయం ఉండింది కదా?"

"ప్రేమా? అదేమిటో నాకు తెలియదు. అయినా నాకు సంబంధించినంత వరకు గుడిలో ఉండే దేవుడు ఎలాగో ఈ ప్రేమా అలాగే. దాని ఉనికిని నమ్ముతూ జీవితాన్ని గడిపెయ్యటమే." మామ్మ చేతులు దులుపుకుని ఇక లేద్దాము అన్నట్టు సైగ చేసింది.

COMMENTS